సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



అంతా ఇష్టారాజ్యం

జీఆర్‌ఏయూలో ఇష్టారాజ్యం నడుస్తోంది. కొత్త నియామకాలపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

- IIలో



పశుగణనకు సర్వం సిద్ధం

నేటి నుంచి పశు గణన జరగనుంది. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- IIలో

ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగట్లపాలెం తీరంలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుడగట్లపాలెం హార్బర్ పనులు గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరు, నిర్మాణ డిజైన్, భూ కేటాయింపులు వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కేజీబీవీ నియామకాల్లో రోస్టర్ విధానం పాటించాలి

శ్రీకాకుళం: శ్రీకాకుళం సర్వ శిక్షా అభియాన్ ద్వారా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీలో రోస్టర్ విధానం పాటించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు గురువారం డిమాండ్ చేశారు. సర్వశిక్షా అధికారులు అక్టోబర్ 23వ తేదీ అర్ధరాత్రి విడుదల చేసిన సీఆర్టీ, పీజీటీ, పార్ట్ టైం టీచర్లు తదితర ఉద్యోగాల నియామకపు జాబితాలో ఏపీఎస్ఎస్ఎస్ రూల్-22, జీఓ-77 ప్రాప్తికి మెరిట్ కం రోస్టర్ విధానం పాటించలేదని తప్పు పట్టారు. దీని వల్ల రిజర్వ్‌డ్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నోటిఫికేషన్ ప్రాప్తికి సర్టిఫికెట్స్ పరిశీలన తరువాత ప్రొవిజనల్ జాబితాలను మెరిట్ కం రోస్టర్ పద్ధతిలో 1:3కాకుండా 1:20లో అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలవటం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

'మడపాం నుంచి నరసన్నపేటకు ఇసుక రూ.800 మాత్రమే'



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్న

టెక్కలి: రాష్ట్రంలో మద్యం ద్వారా 7 రోజుల్లో రూ.700 కోట్లు ఆదాయం వచ్చిందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. అప్లికేషన్ల ద్వారానే రూ.1900 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. తన జీవితంలో ఎన్నడూ ఇంత తక్కువ ధరకు ఇసుక చూడలేదని అన్నారు. మరికొద్ది రోజుల్లో వద్దంటే ఇసుక దొరుకుతుందన్నారు. ట్రాక్టర్లు, నాటు బళ్ల మీద ఎక్కడ కావాలంటే అక్కడ నుంచి ఇసుక తెచ్చుకోండని స్పష్టం చేశారు. ఇసుక ఎత్తుకోవడానికి శక్తి లేకపోతే రీచ్‌లలో మనుషులను పెట్టామని ర్యాంపు నిర్వాహణకు రూ.400 నిర్ణయించామన్నారు. మడపాం నుంచి టెక్కలికి రూ.2400కే ట్రాక్టర్ ఇసుక ఇస్తున్నామని వెల్లడించారు. నరసన్నపేటకు రూ.800కే ట్రాక్టర్ ఇసుక ఇస్తున్నామని తెలిపారు. కాశీబుగ్గ సంఘటనలో బాధితుల తల్లి మొదట ఫిర్యాదుకు ముందుకు రాలేదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ. 2.02 లక్షలు



హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.2,02,758 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు గురువారం తెలిపారు. గడిచిన 86 రోజులకు గానూ దేవదాయ శాఖ అధికారులు, అర్చకుల సమక్షంలో హుండీని లెక్కించినట్లు ఆయన తెలిపారు. పర్యవేక్షణ అధికారి టి.రవితోపాటు సత్యసాయి సేవా సంఘం అధ్యక్షులు పైడి శెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు రద్దు

కాశీబుగ్గ: దానా తుఫాన్ సందర్భంగా జిల్లా మీదుగా నడిచే కొన్ని రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా రైల్వే డివిజన్ అధికారులు తెలియజేశారు. ఈనెల 25వ తేదీ శుక్రవారం నాటి రద్దయిన రైలు వివరాలు ఇలా ఉన్నాయి.

దిగా - విశాఖపట్నం (22873) ఎక్స్‌ప్రెస్
భువనేశ్వర్-విశాఖపట్నం (22819) ఎక్స్‌ప్రెస్
బ్రహ్మపూర్-విశాఖపట్నం (08531) పాసింజర్
షాలీమార్ - పూరి (12895) ఎక్స్‌ప్రెస్
షాలీమార్ - పూరి (12821) ఎక్స్‌ప్రెస్
గుణుపూర్ - విశాఖపట్నం (08521) ఎక్స్‌ప్రెస్
బ్రహ్మపూర్- విశాఖపట్నం (18525) ఎక్స్‌ప్రెస్
భువనేశ్వర్ - విశాఖపట్నం (20841) ఎక్స్‌ప్రెస్
భువనేశ్వర్ - పలాస (08443) ఎక్స్‌ప్రెస్
భువనేశ్వర్-సికింద్రబాద్ (17015) విశాఖ ఎక్స్‌ప్రెస్
భువనేశ్వర్-బెంగుళూర్(18463)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్
పూరి- గాంధీగాం (22974)ఎక్స్‌ప్రెస్ (26వ తేది)
భువనేశ్వర్-రామేశ్వరం (20896) ఎక్స్‌ప్రెస్
విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) ఎక్స్‌ప్రెస్
గుణుపూర్ - కటక్ (084422) రైలు
పూరి - నిజాముద్దీన్ (08475) ఎక్స్‌ప్రెస్
పూరి - షాలీమార్ (12822) ఎక్స్‌ప్రెస్
పూరి - ఆనంద విహార్ (12875) ఎక్స్‌ప్రెస్
పూరి - గుణుపూర్ (18417) రైలు
గుణుపూర్ - పూరి (18418) రైలు
విశాఖపట్నం - గుణుపూర్ (08522) ఎక్స్‌ప్రెస్
రామేశ్వరం - భువనేశ్వర్ (20895) ఎక్స్‌ప్రెస్



● చెప్పింది ఇది..

'స్థానిక ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలగనివ్వం. వారి గౌరవాన్ని మరింత పెంచుతాం. సర్పంచ్, ఎంపీటీసీల ద్వారా ప్రజాస్వామ్యబద్ధంగా ఏ పనులైనా గ్రామాల్లో చేయిస్తాం. ప్రజాప్రతినిధుల్ని డమ్మీలు కానివ్వం.
- డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కల్యాణ్ చెప్పిన మాటలివి..

● చేసింది ఇది..

డిజిటల్ అసిస్టెంట్‌లందరికీ విజ్ఞప్తి. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కాకుండా ఉపాధి పనులు చేసేందుకు వెండర్స్ పేర్లు ఎమ్మెల్యేని అడిగి గ్రూప్‌లో పెట్టడం జరిగింది. ఇది పెద్ద రఫ్చర్ చేయకుండా ఏ పేర్లు ఉన్నాయో వారికి సంబంధించిన ఆధార్, పాన్, బ్యాంకు నంబర్స్ కలెక్ట్ చేసి ఇస్తే డ్వామా ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయిస్తాం. ఈ విషయాన్ని ఎంపీడీఓ తెలియజేయమన్నారు. - ఎచ్చెర్ల నియోజకవర్గంలో డిజిటల్ అసిస్టెంట్‌లకు ఓ అధికారి వాయిస్ మెసేజ్ ఆదేశమిది

ఆ కమిటీ కుర్రోళ్లే..

- జన్మభూమి కమిటీలనే మరోరూపంలో తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం
- సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలను డమ్మీగా చేసేస్తున్న పరిస్థితి
- వీరి హక్కులకు భంగం కలిగిస్తూ వెండర్స్ వ్యవస్థను తీసుకొచ్చిన వైనం
- వెండర్స్‌కే ఉపాధి పనులు.. వారి పేరునే బిల్లులు మంజూరు
- స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఉపాధి పనులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాటలు ఒట్టి బూటకమని తేలిపోయాయి. జనం ముందు చెప్పేదొకటి, ఆ తర్వాత చేస్తున్నదొకటి అని స్పష్టమైంది. కూటమి ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం సర్వ నాశనవుతోంది. జన్మభూమి కమిటీలకు మరో జన్మనిస్తూ వెండర్స్ వ్యవస్థను ఈ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఉపాధి హామీ పనుల్లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేకుండా వెండర్స్ అనే కొత్త పేరుతో కూటమి నాయకుల్ని రంగంలోకి దించి, వారితోనే ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనుల్ని చేయిస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కేవలం తీర్మానాలకు పరిమితం చేసి, ప్రతిపాదించిన పనుల్లో వీరిని పక్కన పెట్టి టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకు



లకు పనుల కాంట్రాక్ట్‌ను అప్పగించారు. విచిత్రమేమిటంటే పనులకు సంబంధించిన నిధులు కూడా ఆ వెండర్స్ ఖాతాలకే జమ చేసేలా పవన్ కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్ శాఖ అడుగులు వేస్తోంది.

ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకమిది. ఇందులో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎవరి పేర్లను రాయలేదు. కానీ, టీడీపీ కూటమికి చెందిన వ్యక్తుల పేర్లను మాత్రం వెండర్ పేరుతో గౌరవ అతిథులుగా వేశారు.

మాటలన్నీ బిల్డప్పేనా..?

మీడియా సమావేశాల్లో పవన్ కల్యాణ్ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తున్నామని ఎంతగా బిల్డప్ ఇస్తున్నా.. వాస్తవ రూపంలో ఆ పనులేవీ కనిపించడం లేదు. కేంద్రం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టేందుకు ఎప్పుడూ, ఏ ప్రభుత్వం చేయని విధంగా పనులు చేపడుతున్నట్టు పవన్ కల్యాణ్ నేతృత్వంలోనే పంచాయతీరాజ్ శాఖ హడావుడి చేసింది. పల్లె పండగ పేరుతో కొబ్బరికాయలు కొట్టి, శిలాఫలాకాలు వేసి ఆర్భాటం చేసింది. కానీ, ఆచరణలో అన్నీ ప్రజాస్వామ్యానికి విరుద్ధంగానే జరిగాయి. పవన్ కల్యాణ్ చెప్పినవన్నీ బిల్డప్‌కే పరిమితమయ్యాయి.

అడ్డగోలుగా బరితెగింపు

సాధారణంగా పంచాయతీల్లో ఏ పనులు చేపట్టినా సర్పంచ్‌ల నేతృత్వంలో పంచాయతీ కార్యవర్గం ఆధ్వర్యంలో జరగాలి. మండల పరిషత్ నిధులతో చేపట్టే పనులు ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో జరుగుతాయి. పంచాయతీల తీర్మానంతోనే ఏదైనా జరగాలి. కానీ, ప్రస్తుతం తీర్మానాల వరకే సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలని, పనులు వచ్చేసరికి తమ పార్టీలకు చెందిన నాయకులకేనని ఖరాఖండిగా చెప్పేస్తున్నారు. ప్రస్తుత పాలకులు బరితెగించి వ్యవహరిస్తున్నారు. సర్పంచ్‌లు కేవలం తీర్మానాలకే పరిమితమని తెగేసి చెప్పేస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఉన్నట్టుగా ఇప్పుడు వెండర్ పేరుతో గ్రామస్థాయిలో కొంత మంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ఎంపిక చేసి, వారి పేర్లనే జిల్లా జల యాజమాన్య సంస్థ(డ్వామా)లో రిజిస్ట్రేషన్ చేసి, వారికే గ్రామస్థాయి పనులు కాంట్రాక్ట్ అప్పగించి, వారి పేరును బిల్లులు మంజూరు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఇంకా దారుణమేంటంటే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీల పేర్లు లేకుండా, వెండర్స్ పేరుతో కూటమి నాయకుల పేర్లు శిలాఫలకాలు వేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులను డమ్మీ చేసేసి, వారి హక్కులకు భంగం కలిగిస్తూ, పరిపాలన పరంగా అవమాన పరుస్తూ ప్రజాస్వామ్యానికే చేటు తెస్తున్నారు.



ఇచ్ఛాపురం ఎంపీడీఓ రామారావుకు ఆ మండల సర్పంచ్‌లు చేసిన ఫిర్యాదు ఇది. గ్రామంలో పనులు గుర్తించాం, తీర్మానాలు చేసి ప్రతిపాదనలు పంపించాం కానీ, మంజూరైన పనులు మాత్రం వెండర్స్‌గా చెప్పుకునే టీడీపీ నాయకులతో చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని, ఏ చట్టం ప్రకారం పంచాయతీ సర్పంచ్‌ల పనుల కమిటీ తీర్మానం లేకుండా పనులు చేపడుతున్నారో చెప్పాలని కోరారు.

జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావుని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఎం.వెంకటేశ్వరరావు ప్రస్తుతం జీఏడీలో పోస్టింగ్ కోసం వేచి ఉన్నారు. అక్కడ నుంచి ఆయనకు జిల్లాలో డీఆర్‌ఓగా పోస్టింగ్ వేశారు. జిల్లాలో ఉన్న డీఆర్‌ఓ ఎం.గణపతిరావు రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం భూ సేకరణ విభాగం ఎస్‌డీసీ అప్పారావు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రణస్థలంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి నిధులు



రణస్థలం: రణస్థలంలో ఎన్‌హెచ్-16లో ఆరు లేన్లతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.252.42 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. సుమారు 800 మీటర్ల పొడవులో ఓపెన్ సింగిల్ పిల్లర్లతో పాత పెట్రోల్ బంకు నుంచి దన్నానపేట కూడలి సుమారు రెండు కిలోమీటర్లు వరకు 45 మీటర్లు వెడల్పుతో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేసినట్లు హైవే అధికారులు వెల్లడించారు. గతంలో చేపట్టిన బైపాస్ రైతుల నష్టపరిహారం చెల్లింపుల వ్యత్యాసం వల్ల విరమించుకున్నారు. కేంద్ర మంత్రి ప్రకటనతో రణస్థలం మండల వాసుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

ఇన్‌చార్జి రిజిస్ట్రార్ నియామకం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత ఓడీపై ఢిల్లీ వెళ్లారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా సోషల్‌వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓఎస్‌డీ కావ్యజ్యోత్స్నను వీసీ రజిని నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెగ్యులర్ రిజిస్ట్రార్ విధులకు హాజరయ్యే వరకు ఈమె ఇన్‌చార్జిగా కొనసాగుతారు.

కొత్త రేషన్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు

- జిల్లాలో 46 డిపోల డీలర్లకు తప్పని కార్డుల విభజన
- కూటమి కార్యకర్తల ఆర్థిక పునరావాసానికి చర్యలు


శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి కార్యకర్తల ఆర్థిక పునరావాసమే ధ్యేయంగా ప్రభుత్వం కొత్త రేషన్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న రేషన్ డిపోలను విభజించి మరిన్ని ఎక్కువ డిపోలు పెంచేందుకు చర్యలు చేపట్టింది. దీని కోసం 2007లో నాటి ప్రభుత్వం జారీ చేసిన జీఓను మళ్లీ బయటకు తీశారు. రాష్ట్రంలో ఇంతవరకు అమలైన ఇంటింటికీ రేషన్ పంపిణీ అన్నది త్వరలోనే ఆగిపోనుంది.

ఇప్పటికే జిల్లాలో సుమారు 15 మందిపై 6ఎ కేసులు నమోదు చేసి వారిని డిపోల నుంచి తప్పించారు. ఇంకొందరిని కూడా ఎలాగోలా డిపోల నుంచి వెళ్లగొట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాజకీయ వేధింపులు తాళలేక కొందరు డిపోలను స్వచ్ఛందంగా విడిచిపెట్టేస్తున్నారు. ఇలా ఖాళీ అయిన డిపోలను కూటమి నేతల చేతుల్లో పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారు.

తాజాగా జిల్లాలో 46 డిపోలు విభజించనున్నారు. ఇందులో ఇచ్ఛాపురం-1, గార-1, కంచిలి-2, కవిటి-2, కోటబొమ్మాళి-3 కొత్తూరు-4, లావేరు-2, మందస-1, నరసన్నపేట-3, పాతపట్నం-2, పోలాకి-1, రణస్థలం-1, సంతబొమ్మాళి-2, సోంపేట-2, శ్రీకాకుళం-18, వజ్రపుకొత్తూరు-1 డిపోలువిభజనకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

విభజన డిపోల డీలర్లకు నోటీసులు

గ్రామీణ ప్రాంతాల్లో 800 కార్డులు, పట్టణ ప్రాంతాల్లో 1000 కార్డులు అంత కంటే మించి ఉన్న డిపోలను విభజించనున్నారు. వీరికి సంబంధిత మండలాల నుంచి తహసీల్దార్లు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసు ప్రాప్తికి డిపోను విభజన చేయనున్నామని, ప్రస్తుతం ఉన్న కార్డులను రెండు



డీలర్లకు జారీ చేసిన నోటీసు

డిపోలకు చేసి, మరో డీలరును ఏర్పాటు చే యనున్నామని నోటీసులో పేర్కొన్నారు. ఈ విభజన వల్ల కేవలం 46 డిపోల్లో కార్డుల తగ్గింపుతో పాటు పట్టణ ప్రాంతాల్లో పక్క ఉన్న డిపోల్లో ఎక్కువ ఉన్నా, వాటిని కొంత మేర తగ్గించి కొత్త డిపోలో చేర్పించేందుకు వెలుసుబాటుగా జీఓ విడుదల చేశారు.

నోటీసులు రావడంతో డీలర్లు ఒక్కసారి డీలాపడ్డారు. కూటమి ప్రభుత్వం తమకు మేలు చేస్తుందని ఆశిస్తుంటే.. ఇలా ఉన్న డిపోలను విభజించి ఉన్న ఆదాయానికి గండికొట్టేందుకు ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తున్నారు.

బాబు పాలనలో అన్నీ అరిష్టాలే



రణస్థలంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ సీతారాం, మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

రణస్థలం: వైఎస్సార్ సీపీని పటిష్టం చేద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు పలువురు నేతలు విజయనగరం జిల్లా గుర్లలోని డయేరియా సోకి మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలవడానికి వెళ్లారు. ఈ సందర్భంగా రణస్థలంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో ఎక్కడ చూసిన అత్యాచార ఘటనలు, సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవించడాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలకు అష్టకష్టాలు తప్పడం లేదని, వరదలు, తుఫానులు, శాంతి భద్రతలు లోపించడం ఇలా అన్నీ అరిష్టాలే జరుగుతున్నాయని చెప్పారు. డయేరియా సోకిన వ్యాధిగ్రస్తులకు కనీసం వైద్య సదుపాయం అందించలేని స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం ఉండటం దారుణమైన పరిణామమని అన్నారు. కార్యక్రమంలో పేడాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నాయకులు అందవరపు సూరిబాబు, మెంటాడ పద్మావతి తదితరులు ఉన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



పంచారామాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీపీటీఓ విజయ్‌కుమార్, ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసం సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో పంచారామాల దర్శనార్థం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుందని, ఈ బస్సులను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ డీపీటీఓ కార్యాలయంలో గురువారం పంచారామాలకు సంబంధించిన కరపత్రాలను డీపీటీఓ విజయ్‌కుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు హనుమంతు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ పంచారామాలైన అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట తదితర పుణ్యక్షేత్రాలను దర్శించే భక్తుల కోసం ఆర్టీసీ సూపర్‌లగ్జరీ, అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను వేయడం జరిగిందన్నారు. నవంబరు 3వ తేదీ, 10, 17, 24వ తేదీలలో ప్రతి ఆదివారం సాయంత్రం 4గంటలకు జిల్లా కేంద్రమైన శ్రీకాకు ళం ఆర్టీసీ కాం



ప్లెక్స్ నుంచి బస్సులు బయల్దేరుతాయని అన్నారు. పంచారామాల దర్శన అనంతరం మళ్లీ తిరిగి మంగళవారం వేకువజామున శ్రీకాకుళం కాంప్లెక్స్‌కు బస్సులు చేరుకుంటాయని తెలిపారు. శ్రీకాకుళం నుంచి సూపర్‌లగ్జరీ బస్సుకు ఒక్కొక్కరికి ప్రయాణ ఛార్జీ రూ.2,400, అల్ట్రాడీలక్స్ బస్సుకు రూ.2,350, ఎక్స్‌ప్రెస్ బస్‌కు రూ.2,000గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే శబరిమల యాత్రకు కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోందని, శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆరు, ఏడు రోజులపాటు యాత్ర ఉంటుందని అన్నారు.

ఇంకెక్కడికి వెళ్లాలి..?



- మహిళలకు పోలీస్‌స్టేషన్‌లోనూ కొరవడిన భద్రత
- మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ లైంగిక వేధింపులు
- ఎస్పీకి ఫిర్యాదు చేసిన కానిస్టేబుల్
- గుట్టుచప్పుడు కాకుండా విచారణ

ఆమదాలవలస/శ్రీకాకుళం క్రైమ్:

మహిళలకు రక్షణ దొరికే చోటు అంటూ ఏదీ లేకుండాపోతోంది. ఆఖరికి పోలీస్‌స్టేషన్‌లోనూ అక్కడి మహిళా సిబ్బందికే లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయి. తన డిపార్ట్‌మెంట్‌లోనే పనిచేస్తున్న కిందస్థాయి మహిళా ఉద్యోగిపై ఓ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కోవడం జిల్లాలో కలకలం రేపింది. కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ వైపు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి దూకుడుగా వెళ్తూ పోలీసు శాఖపై ఉన్న మచ్చలను తుడిచే ప్రయత్నం చేస్తుంటే.. కొందరు అధికారుల వైఖరి ఆ శాఖ ప్రతిష్టను మసకబారేలా చేస్తున్నాయంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు. వివరాల్లోకి వెళితే..

జిల్లాకేంద్రానికి సమీపంలో ఉన్న ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఆ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఓ మహిళా కానిస్టేబుల్ జిల్లా ఉన్నతాధికారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఓ సివిల్ కేసు విషయమై బయటకు వెళ్లేటప్పుడు ఇలా ప్రవర్తించడంతో పాటు అంతకు ముందు సైతం లైంగికంగా వేధించినట్లు చెప్పింది. ఇది జరిగి నాలుగు రోజులవుతోంది. ఈ విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా విచారణ చేయించారు. అయితే గురువారం ఈ విషయం అందరికీ తెలిసిపోయింది.

ఎస్ఐ ఏమన్నారంటే..

పై విషయాలపై నిందారోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐని 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఐదు రోజుల ముందు కేసు విషయమై బయటకు వెళ్లిన మాట వాస్తవమేనని, తాను ఇదివరకు పనిచేసిన ఏ పోలీస్ స్టేషన్‌లో ఏ మహిళ పట్ల ఇలా ప్రవర్తించలేదని, ఈమెపై కూడా అసభ్యంగా ప్రవర్తించలేదని అన్నారు. దీనిపై ఇప్పటికే ఎంక్వైరీలో తన తప్పేం లేదని తెలిసిందని, ఎవరో కొంతమంది గిట్టని వ్యక్తులు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తాను ఏ స్టేషన్‌లో ఎలాంటి కలెక్షన్లకు పాల్పడలేదని అన్నారు.

అభియోగాలు ఎన్నో..

లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న ఆమదాలవలస ఎస్ఐపై ఇదివరకు కూడా అనేక అభియోగాలు ఉన్నాయి. న్యాయం చేయాలని స్టేషన్‌ను ఆశ్రయించిన వారిని టార్గెట్ చేస్తూ పలు సెటిల్‌మెంట్‌లు చేసినట్లు సమాచారం. ఆమదాలవలసకు బదిలీపై వచ్చిన నుంచి తన ప్రైవేటు వాహనానికి ఒక యువకుడిని డ్రైవర్‌గా మందస ప్రాంతం నుంచి తీసుకువచ్చారు. ఆయన్ని ఇక్కడ మైత్రి కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినట్లు స్థానికులకు పరిచయం చేసి స్థానికంగా ఉన్న పలువురు వ్యాపారుల వద్ద కలెక్షన్‌లు చేసేందుకు ఉపయోగించినట్లు సమాచారం. అయితే ఆ వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ స్థానికంగా ఒక ఆర్ఎంపీ వైద్యుని దగ్గర వైద్యం పొంది మందులు రియాక్షన్ ఇవ్వడంతో మృతిచెందాడు. ఆ ఆర్ఎంపీ వైద్యుని వద్ద కూడా రూ.లక్షల్లో మొత్తాన్ని వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎస్పీ ఏమన్నారంటే..

ఇదే విషయమై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వద్ద ప్రస్తావించగా తన నోటీస్‌కు మహిళా కానిస్టేబుల్ అంశం వచ్చిందని, విచారణ చేస్తున్నామన్నారు. ఎస్ఐ వివిధ స్టేషన్లలో చేస్తున్న కలెక్షన్ల విషయమై తమకు ఎలాంటి సమాచారం రాలేదని, తమ నోటీస్‌లోకి వస్తే విచారణ జరిపి రుజువైతే చర్యలు తీసుకుంటామన్నారు.

కలెక్షన్ కింగ్..

ఎస్ఐ ఈ స్టేషన్‌కు వచ్చి కొన్ని నెలలే అయినప్పటికీ.. ఇదే పోలీస్‌స్టేషన్‌లో గత ఎనిమిదేళ్లుగా మైత్రి మల్లేశ్వరరావు వెన్నుదన్నుగా ఉండి కలెక్షన్లు అందిస్తున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వెలువడుతున్నాయి. ఖైనీ, గుట్కాలు, గంజాయి రవాణా చేసేవారు, పట్టణంలో కృష్ణాపురం, అక్కులపేట, గాజులకొల్లివలస కొండపైన, సుగర్ ఫ్యాక్టరీ వెనుక భాగంలో పేకాటరాయుళ్ల మైత్రి మల్లేశ్వరరావుకు కలెక్షన్‌లు తీసుకువచ్చి ఇస్తుంటారని, అవి ఎస్ఐకు చేరవేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం టూటౌన్‌లో సైతం ఇలాంటి ఆరోపణలే ప్రజల నుంచి రావడం విశేషం.

మహిళా కళాశాలలో 'ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్'



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి సుధ

శ్రీకాకుళం న్యూకాలనీ: టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, ఇలా విద్యార్హతలు కలిగిన ప్రతిఒక్కరూ ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో గురువారం 'ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్'ను నిర్వహించారు. కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సూర్యసునీత ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షన జరిగింది. ఈ సందర్భంగా సుధ మాట్లాడుతు ప్రతి విద్యార్థి పదో తరగతి పూర్తయిన వెంటనే, ఎంప్లాయిమెంట్ కోసం 'స్టేట్ పోర్టల్', 'నేషనల్ కెరీర్ ఫర్ సర్వీసెస్' వంటి పోర్టల్స్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకోవాలని, సమయానికి చేసుకోకపోతే ఆరు నెలలు గ్రేస్ పీరియడ్, రెన్యువల్ చేసుకోకపోతే మళ్లీ మొదటి నుంచి ప్రాసెస్ చేసుకోవాలని అన్నారు.

క్లుప్తంగా

పది మంది జూదరుల అరెస్టు

పొందూరు: మండలంలోని సింగూరు సమీపం లో బుధవారం రాత్రి ఒంటి గంట సమయం లో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి 10 మంది జూదరులను అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్లు అందిన పక్కా సమాచారం మేర కు ఎస్సై వి.సత్యనారాయణ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. వీరి వద్ద నుంచి రూ.1,50,520 నగదు, 9 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నా రు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐటీఐల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐల్లో మిగులు సీట్లకు ఐదో విడ త కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల కన్వీనర్ ఎల్.సుధాకర్‌రావు గురువారం తెలి పారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యా ర్థులు ఈ నెల 26లోపు ఐటీఐ.ఏపీ.జీవీవో.ఐఎ న్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అనంతరం సమీప ప్రభుత్వ ఐటీఐకి వెళ్లి వెరిఫి కేషన్ చేయించుకోవాలన్నారు. 28న ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేట్ ఐటీఐల్లో ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

యూజీసీ నిధుల కోసం వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: యూనివర్సిటీ గ్రాంట్స్ కమి షన్ (యూజీసీ) నిధులు మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవి ద్యాలయం రిజిస్ట్రార్ పి.సుజాత ఢిల్లీలో గురు వారం పలువురు అధికారులను కలిశారు. రూ. 2.50 కోట్లు నిధులు యూజీసీ నుంచిరావాల్సి ఉందని చెప్పారు. అనంతరం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి యూజీసీ నిధులు మంజురుకు కృషిచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

వంట సామగ్రి చోరీ



తెరిచి ఉన్న తలుపులు

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్న భోజన వంటగదిలోకి చొరబడి గ్యాస్ సిలిండర్, అల్యూమినియం వంట పాత్రలు, రూ.15 వేలు విలువైన కిరాణా వస్తువులు చోరీ చేసినట్లు వంట నిర్వాహకు రాలు రాధ తెలిపారు. ఈ మేరకు నరసన్నపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు.

వర్సిటీకి రెడ్‌క్రాస్ ప్రశంసాపత్రం



వీసీ రజినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ సేవలకు గాను రెడ్‌క్రాస్ తరపు న ప్రశంసాపత్రాన్ని ప్రతినిధులు చైతన్య, రమ ణలు గురువారం వైస్‌చాన్సలర్ కె.ఆర్.రజినికి అందజేశారు. రక్తదాన శిబిరాల ఏర్పాటు, విప త్తుల సమయంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవ లు, వైద్య శిబిరాల నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలను గాను ఈ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్య క్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు రత్న అవార్డులకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళా పరిషత్ నిర్వహణలో నవంబరు 16న విశాఖలో జాతీ య తెలుగు వెలుగు రత్న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు, కళాభూ షణ్ పి.ఎ.భాస్కరరావు ఒక ప్రకనటలో తెలిపా రు. సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, సాహిత్యం, గానం, జానపదం, నాటకరంగం, క్రీడా రంగం, ఆధ్యాత్మికం, వైద్యం, సమాజ సేవకులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధు లు అర్హులని పేర్కొన్నారు. వివరాలు, పత్రిక ల్లో ప్రచురితమైన కథనాలను నవంబర్ 5లో గా 9848481767 నంబర్‌కు పంపించి రిజిస్ట్రే షన్ చేసుకోవాలని కోరారు.

అంతా ఇష్టారాజ్యం!



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం



- అంబేడ్కర్ వర్సిటీలో విచిత్ర పరిస్థితి
- ఇష్టారాజ్యంగా రిటైర్డ్ ఉద్యోగుల నియామకాలు
- నచ్చని వారికే రూల్.. నచ్చిన వారికి నో రూల్!
- జీఓను వక్రీకరించడంపై విమర్శలు

ఎచ్చెర్ల క్యాంపస్ :

''వర్సిటీలో పనిచేస్తున్న రిటైర్డ్ అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు 12 మందిని తొలగిస్తు న్నాం. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి నుంచి జూన్ 3వ తేదీన వచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం అమలు చేస్తున్నాం'' ఇదీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాల యం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీలా సుజాత జూన్ 4న విడు దల చేసిన ప్రకటన సారాంశం. ఈ మేరకు అప్పట్లో 12 మందిని తొలగించారు. అయితే మళ్లీ రిటైర్డ్ అధికారులు, ఉద్యోగుల నియా మకాలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వంలో నియమితులైన కొందరికి మాత్రమే తొలగింపు నిబంధనలు అమలు చేసి.. కొత్త ప్రభుత్వం వచ్చాక అధికారులకు నచ్చిందే రూల్‌గా నియామకాలు చేపడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. తొలగింపునకు గురైన 12 మందిలో మళ్లీ ముగ్గురి (విశ్వేశ్వరరావు, జనార్దనరావు, ఆర్.ఎస్. పట్నాయిక్-నాన్ టీచింగ్)ని విధుల్లోకి తీసుకున్నా రు. వీరికి వేల రూపాయల్లో జీతాలు సైతం ఇస్తు న్నారు. తాజాగా మరో రెండు నియామకాలు చేపట్టారు. ప్రత్యేకాధికారిగా రూ.లక్ష వేత నానికి విశ్రాంత ఆంధ్రా విశ్వవిద్యాలయం అధికా రి కె.సామ్రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారిగా విశ్రాంత ఉద్యోగి అనంతరావులను నియమించా రు. మరోపక్క ఎటువంటి ప్రకటన లేకుండా ఈ నియామకాలు చేపట్టారు. 12 మందిని తొలగించి.. నచ్చిన వారిని మళ్లీ నియమించుకోవటంపై విమర్శ లు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రభుత్వం విడుద ల చేసిన జీవో వర్సిటీలకు వర్తించదని అప్పట్లో తొలగింపునకు గురైన కొందరు ఉద్యోగులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ఉన్నత విద్యా మండలి ఆదేశాలు ఉన్నాయని, కచ్చితంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. తాజాగా మళ్లీ నియా మకాలు చేపట్టడం చర్చనీయాంశమైంది.

ఇదేం తీరు..

వర్సిటీలో నచ్చిన వారికి ఒక న్యాయం, నచ్చని వారికి ఒక న్యాయం అమలవుతోందనే విమ ర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల వ్యవహార శైలిని కొందరు తప్పు పడుతున్నారు. ఈ అంశం పై సమాచార హక్కు చట్టం కింద సైతం పలు వురు దరఖాస్తులు చేసుకున్నారు. గత అధికారు లకు అనుకూలంగా ఉన్న వారిని తొలగింపే లక్ష్యంగా ప్రస్తుత అధికారులు వ్యవహరిస్తు న్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశ్రాంత ఉద్యోగుల తొలగింపు అన్న ప్రభుత్వ జీవోను తమకు అనుగుణంగా వక్రీకరించటంపై సైతం పలువురు తప్పుపడుతున్నారు.

పంటల బీమా పథకాన్ని వినియోగించుకోవాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న రబీ సీజన్‌కు సం బంధించి పంటల బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ కోరారు. పంటల బీమాపై గురువారం కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలె క్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీడి మామిడి విస్తీర్ణం ఎక్కువగా ఉన్నం దున లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదే శించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు తగు శిక్షణ అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామికి సూచించారు. సమావేశంలో సీపీఓ ప్రసన్నలక్ష్మి, డీసీసీ బ్యాంక్ సీఈఓ వరప్రసాద్, పలు బీమా కం పెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బంగారం మాయంపై సీఎంఓ ఆరా

శ్రీకాకుళం క్రైమ్ : రాష్ట్రవ్యాప్తంగా గతేడాది సంచల నం సృష్టించిన గార ఎస్బీఐ తనఖా బంగారం మాయం కేసు మరోసారి చర్చనీయాంశమైంది. సీఎంవో కార్యాలయం నుంచి కేసును ఆరా తీస్తూ అటు జిల్లా పోలీసులకు, ఇటు చనిపోయిన బ్యాం కు ఉద్యోగిని స్వప్నప్రియ కుటుంబాలకు సంక్షిప్త సందేశాలు, ఫోన్‌లు వచ్చాయి. ఈ కేసు విషయమై తమ కుటుంబాన్ని అన్యాయంగా ఇరికించారం టూ.. తన కుమార్తెను బలితీసుకున్నారంటూ ఇప్ప టికే స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళాదేవి జాతీయ మానవ హక్కులు, జాతీయ మహిళా కమిషన్లకు ఫిర్యాదు చేయడమే కాకుండా సీఎం చంద్రబాబు కు, హోంమంత్రి అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఎంవో కార్యాలయం నుంచి స్వప్నప్రియ తల్లికి ఫోన్ వచ్చింది. విచారణ నిష్పక్షపాతంగా పోలీసు లు చేస్తున్నారా లేదా అన్నదానిపై వారు ఆరా తీసిన ట్లు తెలిసింది. కేసును పర్యవేక్షిస్తున్న అధికారులకు సైతం కేసు పురోగతి గురించి ఆరా తీసినట్లు సమా చారం. ఇప్పటికే ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఈ కేసు ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, పైఅధికారుల నుంచి కూడా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాల ని ఆదేశాలు రావడంతో టౌన్ డీఎస్పీ సిహెచ్ వివే కానందతో విచారణను వేగవంతం చేయించారు. కేసులో కీలకమని భావిస్తూ ఆరోపణలు ఎదుర్కొం టున్న.. ప్రస్తుతం పోలీసులు అనుమానిస్తున్న అప్ప టి జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ టి.ఆర్.ఎం.రా జును ఇప్పటికే మూడు నాలుగుసార్లు సబ్‌డివిజన్ కార్యాలయానికి పిలిపించి ఆరా తీశారు.

మిస్టర్‌ఆంధ్రా పోటీలకు ఎంపిక



బాడీబిల్డింగ్ క్రీడాకారులతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 27న విజయనగరం వేదిక గా మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరగనున్నాయి. ఇందుకు సంబం ధించి శ్రీకాకుళం నగరంలో గురువారం గోపాల్ ఫిట్నెస్ జిమ్‌లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ చేప ట్టారు. పి.రాజేష్(55కేజీలు), ఎం.రఫీఖాన్(60కేజీ లు), డి.గణేష్(65కేజీలు), ఆర్.హరీష్ (55కేజీ లు), ఎన్.రాజు (65కేజీలు), కె.సుమంత్ (60 కేజీ లు), ఆర్.గణేష్ (70కేజీలు), ఏ.భాస్కరరావు (మాస్టర్స్ విభాగం)లను ఎంపిక చేశారు. కార్యక్ర మంలో బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, జిల్లా సెక్రటరీ వి.విజయకుమార్, గోపాల్, టీం కోచ్ కె.గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఆటో అదుపు తప్పి పది మందికి గాయాలు



గాయపడిన మహిళకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: పలాస మండలం కంబిరిగాం జాతీయ రహదారి కూడలిపై ఆటో అదుపు తప్పి బోల్తాపడిం ది. ఈ ఘటనలో పది మంది మహిళా కూలీలు, డ్రైవర్ గాయాల పాలయ్యారు. పెద్దనారాయణపు రం నుంచి కాశీబుగ్గకు ఆటోలో వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న 1033 నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధిత మహిళలకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయ పడిన చింతల పార్వతిని మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘట నపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు.

గడ్డిమందు తాగి వివాహిత ఆత్మహత్య

నందిగాం: మండలంలోని నౌగాంకు చెందిన కొన్ని సావిత్రి (35) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామా నికి చెందిన కొన్ని తవుడు భార్య సావిత్రి కొద్దిరోజు లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగింది. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు హుటాహు టిన టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పి ంచగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. సావిత్రికి ఒక కుమారు డు ఉన్నాడు. మృతురాలి సోదరుడు ముఖలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై షేక్ మహ మ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి



కోనారి జయలక్ష్మి(ఫైల్)

నందిగాం: మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటిపల్లికు చెందిన కోనారి జయలక్ష్మీ(24) పాముకాటు తో మృతి చెందింది. పోలీ సులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోనారి సోమేశ్వరరావుకు జయలక్ష్మీతో ఆరేళ్ల క్రితం వివా హం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు కార్తీక్(5), హరీష్(3) ఉన్నారు. ఈ నెల 21న రాత్రి భోజనం చేశాక ఇంట్లో పడుకున్నారు. రాత్రి 11 గంటల సమ యంలో జయలక్ష్మికి కట్లపాము కాటు వేయడంతో మెకువ వచ్చి భర్తకు చెప్పింది. వెంటనే బైక్‌పై టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్క డ ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన చికి త్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదే హం తరలించారు. నందిగాం ఏఎస్సై వరలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై మహిళ యాసిడ్ దాడి

బూర్జ: మహిళ చేతిలో ఓ వ్యక్తి యాసిడ్ దాడికి గురైన ఘటన బూర్జ మండలం ఓ.వి.పేట గ్రామం లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా డెంకాడ గ్రామానికి చెందిన కలవకోట ప్రసాద్‌కు బూర్జ మండలం ఓ. వి.పేట గ్రామానికి చెందిన మహిళతో తొమ్మిది నెలల కిందట పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది మార్చి నుంచి మే వరకు ఆమదాలవలసలోని పూజారిపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని కలిసి ఉన్నా రు. మనస్పర్థలు రావడంతో 15 రోజుల క్రితం సదరు మహిళ ఓ.వి.పేటలోని సొంత ఇంటికి వెళ్లి పోయింది. బుధవారం ప్రసాద్‌కు ఫోన్ చేసి ఆమ దాలవలస రైల్వేస్టేషన్ వద్దకు రమ్మని చెప్పింది. ప్రసాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉన్నాడు. అయినా మహిళ రాకపోవడం తో ఓ.వి.పేటలోని ఆమె నివాసానికి వెళ్లాడు. దీం తో ఆగ్రహానికి గురైన ఆమె దుర్భాషలాడుతూ బాత్‌రూమ్ శుభ్రం చేసే యాసిడ్‌ను ప్రసాద్‌పై విస రడంతో గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు గురువారం బూర్జ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయ డంతో ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిని ఢీకొట్టిన వ్యాన్

- గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం
- వాహనం విడిచి పరారైన డ్రైవర్



మెళియాపుట్టి పోలీసులకు పట్టుబడిన వాహనం ఇదే

మెళియాపుట్టి: మండలంలో పలాస వెళ్లే రహదారి లో గురువారం ఓ యువకుడిని బొలేరో వాహనం ఢీకొట్టింది. అందులో భారీగా గంజాయి తరలిస్తు న్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఏ వివరాలు వెల్లడించడం లేదు. పర్లాకిమిడి నుంచి ఓ బొలెరో వాహనం పలాస వైపు అతి వేగంతో వెళ్తూ తూముకొండ పరిసర ప్రాంతంలోని ఆకులమ్మ ఆలయం వద్ద సవరజాడుపల్లి గ్రామానికి చెందిన సవర జీసాయి యువకుడిని ఢీకొట్టింది. ఆగకుండా వెళ్లిపోవడంతో కొందరు గ్రామస్తులు వెంబడించా రు. పలాస మండలం టెక్కలిపట్నం వద్ద కాపుకా యడంతో తిరిగి ఎగువ జాడుపల్లి వద్దకే వాహనం ఆగింది. బొలెరోను విడిచిపెట్టి డ్రైవర్ పారిపోయా డు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించా రు. అయితే ఈ ఘటనకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడించలేదు. కాగా, గాయపడిన యువకుడిని చాపర పీహెచ్‌సీకి తరలించి అనంత రం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రిలో చేర్పిం చారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి విఘాతం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

శ్రీకాకుళం కల్చరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే జమిలి ఎన్నికల విధానం భారత ప్రజాస్వామ్యాని కి, ఫెడరల్ స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగిస్తుందని, ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహ రించుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డా రు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో గరి మెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య భారతం- జమిలి ఎన్నికలు' అనే అంశంపై వి.జి.కె. మూర్తి అధ్యక్షతన గురువారం సెమినార్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, కథారచయిత అట్టాడ అప్పలనాయుడులు మాట్లాడుతూ జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గించ వచ్చని, పరిపాలనపై దృష్టి సారించవచ్చని మోదీ ప్రభుత్వం మాయమాటలు చెబుతోందన్నారు. రాష్ట్రాలకుండే పరిమిత హక్కులను కేంద్రం హరిం చాలనే ఉద్దేశంతోనే ఈ ఎన్నికలు తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జమిలికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏపీ దళిత జేఏసీ అధ్యక్షుడు కళ్లేపల్లి రామ్‌గోపాల్, అడ్వకేట్ కిలారి ఈశ్వరరావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షు డు డాక్టర్ సనపల నరసింహమూర్తి, ఏపీడబ్ల్యూ జేఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ రవీంద్ర, ముస్లిం జేఏసీ కన్వీనర్ మెహబుల్లా ఖాన్, సీఐటీయూ జిల్లా ప్రధా న కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

29న సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల(ఆఫీసు సబార్డినేట్ స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు)కు ఏటా నిర్వహించే సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపిక పోటీలకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ నెల 29న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు శ్రీకాకుళం జిల్లా కేంద్రం లోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించాలని నిర్ణయించారు. అథ్లెటిక్స్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, హాకీ, బాస్కె ట్‌బాల్, లాన్‌టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, రెజ్లింగ్, క్యారమ్స్, ఫుట్‌బాల్, వెయిట్‌లిఫ్టింగ్-పవర్‌లిఫ్టిం గ్, స్విమ్మింగ్, యోగా, బెస్ట్ ఫిజిక్ (ఉత్తమ శరీరాకృ తి) క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరుగుతాయి. ఇక్కడ రాణిస్తే రాష్ట్రపోటీలకు పంపించనున్నారు. ఆసక్తి గల వారు గుర్తింపు కార్డుతో ఎంపికలకు హాజ రుకావాలని డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు కోరా రు.పూర్తి వివరాలకు సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల ఇన్‌చార్జి ఎం.మాధురీలత (సెల్:94409 63128)ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కుంకుమార్చన



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్ననాయుడువీధిలో గురువారం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్ర మంలో నాయుడువీధికి చెందిన 121 మంది మహిళలు, పొందర వీధికి చెందిన 50 మంది మహిళలు పాల్గొన్నారు.
– ఇచ్ఛాపురం

రైలు ఢీకొని ఆవులు మృతి

పాతపట్నం: పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం సమీపం లో గురువారం మధ్యాహ్నం రైలు ఢీకొని రెండు ఆవులు మృతి చెందగా, మరో రెండు ఆవులకు తీవ్రగాయాలయ్యా యి. ఉప్పరవీధిలో పాడి రైతు గంట్యాడ రాముకు చెందిన నాలుగు ఆవులు మేత మేస్తుండగా.. రూర్కెలా నుంచి గుణుపూర్ (రాజారాణి ఎక్స్‌ప్రెస్) వెళుతున్న రైలు ఢీకొట్ట డంతో ఈ ఘటన చోటుచేసుకుంది. పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం కరుణాకరరావు ఆధ్వర్యంలో రెండు ఆవులకు వైద్య సేవలు అందించారు.



మృతి చెందిన ఆవులు

పశుగణనకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఫిబ్రవరి 25 వరకూ లెక్కింపు
- 269 మంది సిబ్బందితో సర్వే



నరసన్నపేట: జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో శుక్రవారం నుం చి 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఐదేళ్లకోసారి నిర్వహించే ఈ గణన గతంలో 2019లో జరిగింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో పశుగణన చేపడుతుంది. దీంట్లో భాగంగా జిల్లాలో కూడా ఈ నెల 25 నుం చి పశుగణన మొదలై ఫిబ్రవరి 25 వరకు కొనసాగనుంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, కోళ్లు ఇలా అన్ని రకాల మూగజీవాల లెక్కింపు చేపడతారు. ఈ గణాంకాల ఆధారంగా పశుసంవర్ధక శాఖ ద్వారా పథకాల రూపకల్పన, పాడిపశువులకు అవసరమైన వైద్యం, ఇతర సం క్షేమ పథకాలు అమలు చేస్తారు. మూగ జీవాలకు ఎప్పటి కప్పుడు వైద్యం, ఇతర సదుపాయాలు, మందుల బడ్జెట్, టీకాలు అందించేందుకు కూడా ఈ పశుగణన లెక్కలే ఆధారం.

పక్కాగా వివరాల సేకరణ..

జిల్లా వ్యాప్తంగా 4.7 లక్షల ఇళ్లు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ అం చనా వేసింది. వీటి లెక్కింపునకు 267 మంది సిబ్బందిని విని యోగిస్తోంది. ఇందులో 216 మంది ఎన్యూమరేటర్లు, 51 మం ది సూపర్‌వైజర్లు ఉన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ ఇంటింటికీ వెళ్లి గణన చేయాలి. రోజుకు కనీసం 50 ఇళ్లలో సర్వే చేయాల్సి ఉం ది. పల్లెలతో పాటు పట్టణాల్లో కూడా ఈ సర్వే నిర్వహిస్తారు.

33.21 లక్షల మూగజీవాలు..

2019 పశుగణన ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33.21 లక్షల మూగజీవాలు ఉన్నాయి. వీటిలో 4.96 లక్షల మేరకు ఆవు లు, ఎద్దులు, గేదెలు ఉన్నాయి. 9 లక్షల మేరకు గొర్రెలు, మేక లు, 19 లక్షలు పౌల్ట్రీతో పాటు నాటు కోళ్లు, 25 వేల కుక్కలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి..



అఖిల భారత పశుగణనకు ఏర్పాట్లు చేశాం. ఈ మేరకు ఎన్యూమరేటర్లకు శిక్షణ నిచ్చాం. బుధవారం కూడా కమి షనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశా రు. ఫిబ్రవరి 25 వరకూ పశుగణన కొనసాగుతుంది. గతం లో చేసే పశుగణన కంటే ఇది భిన్నమైనది. ప్రతి ఎన్యూమరే టర్ ఇంటింటికీ వెళ్లి మూగ జీవాలు ఉన్నా.. లేకపోయినా సంబంధిత వివరాలు రికార్డు చేస్తారు.
– జయరాజ్, పశుసంవర్ధక శాఖ డీడీ, టెక్కలి